క్లుప్తంగా

కమిషనర్ బాధ్యతల స్వీకరణ


కమిషనర్ జబ్బార్ మియాకు శుభాకాంక్షలు తెలుపున్న చైర్ పర్సన్, కౌన్సిలర్లు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా శనివారం జబ్బార్‌మియా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులును పెనుగొండకు బదిలీ చేశారు. మైదుకూరులో కమిషనర్‌గా పనిచేస్తున్న జబ్బార్ మియాను ఇక్కడికి బదిలీ చేశారు. మిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జబ్బార్ మియాను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్ పర్సన్లు వరలక్ష్మి, పద్మలత, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటానన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

శింగనమల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శింగనమలకు చెందిన డాక్టర్ కొప్పెర్ల మానసరెడ్డి తెలిపారు. మహిళలకు వచ్చే జబ్బులను గుర్తించి, ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అవకాశాన్ని మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న హాస్టల్ విద్యార్థినులు


గుత్తి: కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన కీచకులను వెంటనే ఉరి తీయాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ బాలికల హాస్టల్లో శనివారం వార్డెన్‌లు, విద్యార్థినులతో కలసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృత్తం కాకూడదంటే కీచకులకు ఉరి శిక్ష విధించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ చంద్రకళ, విద్యార్థినులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దళితులకే వినియోగించాలి


మాట్లాడుతున్న సాకే హరి

గార్లదిన్నె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ నిధులు దళితుల అభివృద్ధికి ఖర్చు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. శనివారం ఆయన గార్లదిన్నెలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్నో ఏళ్లగా అధికారులు,నాయకులు చుట్టూ తిరిగిన పరిష్కారం కాలేదన్నారు. అధిక శాతం భూ సమస్యలపై అర్జీలు అధికారులకు అందజేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే చాలా గ్రామాల్లో దళితులు చనిపోతే పూడ్చడానికి శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలపై వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబిలేసు, రామక్రిష్ణ, మధు, నరసింహులు,నాగేంద్ర, రాము, రమేష్, అంజనేయులు, ఓబన్న ,నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన అపరిశుభ్రత


పుప్పాలలో రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని పలు గ్రామాలు మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో ప్రతి కాలనీ చిత్తడిగా ఉంది. దీనికి తోడుగా మురుగు నీరు ఇళ్ల మధ్యన నిలుస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి. మండలంలోని పుప్పాల, వెంగన్నపల్లె గ్రామాల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. పుప్పాల గ్రామంలో ఎగువ నుంచి తూర్పు వైపునకు మురుగు నీరు వస్తుండడంతో ప్రజలు నడవడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీడీపీలో రచ్చ

- ఎమ్మెల్యే బండారు శ్రావణి తీరుపై 'తమ్ముళ్ల' గుర్రు
- స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిసెంట్ల పదవుల పందేరంపై నిరసన



యల్లనూరు: కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కూడా కాలేదు. అప్పుడే శింగనమల నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లల్లో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. మేం పార్టీని నమ్ముకుని బతుకుతున్నాం. ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డాం. ఎన్నికల సమయంలో పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాం....కోర్టుల చుట్టూ తిరిగాం......ఆఖరుకు మాకు, మా వర్గానికి స్టోర్ , ఫీల్డ్ అసిస్టెంట్ కావాలంటే.. లేదంటారా? మా వర్గానికి కచ్చితంగా ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే బండారు శ్రావణితో ఆ పార్టీ కార్యకర్తలు తెగేసి చెబుతున్నారు. తాజాగా యల్లనూరు మండలం వాసాపురం గ్రామానికి చెందిన పార్టీ ముఖ్య నేత వాసాపురం బాబు అలియాస్ కల్లూరు నరేంద్ర నాయుడు తన వర్గానికి స్టోర్ ఇవ్వలేదని శుక్రవారం కుటుంబసభ్యులతో జిల్లా టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 40 ఏళ్లుగా టీడీపీ అభివృద్ధికి సహకరిస్తున్నానని, నాకే ఎమ్మెల్యే మొండిచేయి చూపుతోందని ఆయన మండిపడ్డారు. నా వర్గానికి చెందిన వాళ్లకు స్టోర్ ఇవ్వకుంటే త్వరలోనే రాష్ట్ర టీడీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తానని ఆయన హెచ్చరిస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో ప్రతి మండలంలోనూ ఎమ్మెల్యే బండారు శ్రావణికి మరి కొందరు తెలుగు తమ్ముళ్లకు కోల్డ్‌వార్ నడుస్తోంది. ఎమ్మెల్యే తనకు నచ్చిన వ్యక్తులకు స్టోర్, ఫీల్డ్ అసిస్టెంట్ పదవులు కట్టబెడుతుందని పలువురు టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు నుంచి పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులకు కాకుండా ఎమ్మెల్యే వద్ద నాలుగు మాటలు చెప్పిన వ్యక్తులకు స్టోర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులు ఇస్తున్నారన్నారు. యల్లనూరు మండలంలో కొందరు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే తీరుపై మండిపడుతున్నారు. నాలుగు రోజుల కిందట యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కూడా ఎమ్మెల్యే కొందరికి వంత పాడిందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. మేమంతా ఓట్లు వేసి గెలిపించింటేనే ఆమె ఎమ్మెల్యే అయ్యారని, లేకుంటే లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిలో కాలి బాటలు ప్రయోజనకరం

- రైతు సదస్సులో ఏడీఏ శైలజ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శైలజ

బుక్కరాయసముద్రం: వరి సాగులో కాలి బాటలో చేసుకోవడం వల్ల ప్రయోజనకరమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైలజ సూచించారు. శనివారం మండలంలోని పొడరాళ్ల, బీకే ఎస్, గోవిందపల్లి, గ్రామాలలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 1100 హెక్టారుల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద 300 బ్యాగుల వరి విత్తనం 50 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామన్నారు. రైతులు వరి సాగులో రెండు మీటర్లకు 30 సెంటీ మీటర్లు కాలి బాటలు తూర్పు పడమర దశలో తీసుకోవాలన్నారు. వీటి వల్ల వరి పైరుకు సూర్యరశ్మి, గాలి బాగా తగలడం వలన సూక్ష్మవ్యాధులు నశించి పోతాయన్నారు. చీడపీడల నివారణకు రసాయన మందులు, మందులు వేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. వరి పైరు నాటిన సమయంలో, గింజ ఏర్పడే సమయంలో, గింజ గట్టి పడే దశలో యూరియా వేసుకోవాలన్నారు. ప్రతి రెండు పంటలకు ఎకరాకు జింక్ సల్ఫేట్ 20 కిలోలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, శంకర్‌లాల్, రైతు సేవా కేంద్రం సహాయకుడు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం కార్మికుల ఆందోళన


బీకేఎస్‌లో సత్యసాయి చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు


కల్లూరులో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బుక్కరాయసముద్రం: సమస్యల పరిష్కారం కోసం సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట 9వ రోజు శనివారం సత్యసాయి చిత్ర పటానికి వినతి పత్రం ఇస్తూ కార్మికులు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులకు జీతాలు మంజూరు చేయాని పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా జీతాలు మంజూరు చేయలేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మన్న, పెద్దన్న, నల్లప్ప, నారాయణ, విశ్వరూప, నరేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో శనివారం సత్యసాయి కార్మికులు దున్నపోతుకు వినతి పత్రం అందజేస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. 600 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే జీతాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యపై నిలదీత


కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న కమిషనర్ జబ్బార్, చైర్ పర్సన్ వన్నూర్ బీ

గుత్తి: తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కారం చేయాలని అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు కమిషనర్ జబ్బార్ మియా , మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశం ప్రారంభంలోనే కౌన్సిలర్లు సమస్యలను ఏకరువు పెట్టారు. 40 రోజులకు ఒకసారి కూడా తాగు నీటిని కుళాయిలకు సరఫరా చేయడం లేదని, ఉత్తినే సమావేశాలు పెడితే ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. సమస్యలను దశల వారీగా పరిష్కారం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాలింతల గది ఏర్పాటు


వైద్యాధికారి గదిని బాలింతల గదిగా మార్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో బాలింతల గదిని ఏర్పాటు చేశారు. సాక్షి దినపత్రికలో శనివారం 'శిథిలావస్థకు చేరిన ప్రభుత్వాస్పత్రి భవనం' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డాక్టర్ శ్రీనివాసబాబు ఆస్పత్రిలో నెర్రెలు బీలి కూలడానికి సిద్ధంగా ఉన్న బాలింతల గదిని వైద్యాధికారి గదికి మార్చారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించామన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి..


మాట్లాడుతున్న ఏఎస్ఐ వెంకటేష్

యాడికి: క్రమశిక్షణ లేకుంటే ఎంత చదువుకున్నా ఉపయోగం లేదని ఏఎస్ఐ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. రెండూ ఉంటేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, భవిష్యత్తు బాగుంటుందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాతో సమయాన్ని వృథా చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి, అధ్యాపకులు సుబ్బరాయుడు, బసవరాజు, నరసింహులు, నాగేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి రేపు

శింగనమల: మండల కేంద్రంలో ఈ నెల 2న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ శనివారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు హాజరవుతారన్నారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

సీహెచ్‌సీ తనిఖీ

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను రాయదుర్గం ఏరియా మెడికల్ ఆఫీసర్ మాధవి నేతృత్వంలోని ఏఓ బాషా, సీనియర్ ఆఫీసర్ చరణ్ బృందం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఇటీవల సీహెచ్‌సీలో కాంట్రాక్ట్ ఉద్యోగ నియామక విషయంలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై వారు విచారణ చేశారు. ఈ విషయంపై వైద్యసిబ్బందితోనూ, స్థానికులతో సమీక్షించారు. వైద్యుల విధులు, వైద్యసేవలకు స్థానికులు సానుకూలంగా స్పందించారు. కాగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంబంధించి అడ్రస్ లేకపోవడంతో వారికి విచారించ వీలుకాలేదు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

వేపచెట్టు నుంచి కల్లు


వేప చెట్టు నుంచి కల్లు కారుతున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని ఓ వేప చెట్టు నుంచి కలు కారుతోంది. ఈ వింతను కార్యాలయపు సిబ్బంది, పనికోసం కార్యాలయానికి వచ్చి ప్రజలు గమనించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు చెట్టుకు పసుపు కుంకుమ దిద్ది భక్తిప్రపత్తులతో పూజలు చేశారు.

'సమగ్ర విచారణ చేపట్టాలి'

గుంతకల్లు: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సీసీ కెమెరాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వంశీయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాల యాజమాన్యం పర్యవేక్షణ లోపం ఇందుకు ప్రధాన కారణమన్నారు. కెమెరాల ఏర్పాటు విద్యార్థుల మాన ప్రాణాలకు ప్రమాదకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిహాసంగా పింఛన్ల పంపిణీ


పామిడిలోని ఓ వీధి కేంద్రంగా పింఛన్లు పంపిణీ దృశ్యం

పామిడి/గుంతకల్లు టౌన్/యల్లనూరు/పుట్లూరు/గార్లదిన్నె/పెద్దవడుగూరు/: టీడీపీ అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీ పరిహాసంగా సాగుతోంది. గత ప్రభుత్వంలో వలంటీర్లు తెల్లవారుజామునే పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. టీడీపీ అధికారం వచ్చాక సీన్ రివర్స్ అయ్యింది. వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బంది చేత పింఛన్ల పంపిణీ చేపట్టింది. అదీ గ్రామ సచివాలయాల వారీగా వార్డుల్లోని ఒక ప్రాంతంలోకి పింఛన్‌దారులను పిలిపించి పింఛన్ పంపిణీ చేపట్టడంపై వృద్ధులు, దివ్యాంగులు, వితుంతువుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా పామిడి అర్బన్‌లో 3,137 పింఛన్లకు గానూ 3,040 మందికి, రూరల్‌లో 4,440 పింఛన్లకు గానూ 4,307 మందికి పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ తెలిపారు.

- గుంతకల్లు పట్టణంలో శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ వెంకట రమణయ్య పరిశీలించారు. వందశాతం పెన్షన్ల పంపిణీ జరిగేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు.
- యల్లనూరు మండలవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా ఫించన్ల ప్రక్రియను శనివారం ఎంపీడీఓ వీరరాజు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు పరిశీలించారు.
- పుట్లూరు మండలంలోని చింతకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు పరిశీలించారు. మండలవ్యాప్తంగా 5,768 మంది పింఛన్‌దారులు ఉండగా రూ.2.5కోట్లును 110 మంది సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేపట్టారు. శనివారం ఉదయం 5 గంటలకే గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు.
- గార్లదిన్నె మండలంలో 7,784 పింఛన్లు గాను మొదటి రోజు 7,476 పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు.
- పెద్దవడుగూరు మండలంలో 7,637 ఫించన్లు ఉండగా 7,355 మందికి పింఛన్ పంపిణీ చేశామని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు


భోగేశ్వరాలయంలో పూజల దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శనిత్రయోదశి పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్, జగదీష్, ప్రవీణ్ ఆధ్వర్యంలో నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ నవగ్రహ అవాహనతో కూడిన అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. శని దోష నివారణార్థం నిర్వహించిన పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అంజన్న జలధి ఉత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో అంజనేయస్వామి జలధి శనివారం వైభవంగా జరిగింది. ఏటా శ్రావణమాసం నాల్గో శనివారం జలధి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా దేవగిరి ఆంజనేయస్వామి కొండపై గంగామాతకు పూజలు నిర్వహించి, ఆలయం వరకు పల్లకీసేవ, జలధి బిందె ఊరేగించారు. సాయంత్రం ఆంజనేయస్వామి ప్రతిమను ట్రాక్టర్‌పై ఉంచి, వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

- ఏడీకి సీపీఐ నాయకుల వినతి

గుంతకల్లు: పట్టణంలో విద్యుత్ సమ్యసలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఏడీ రంగస్వామిని సీపీఐ నాయకుల బృందం కలిసి విన్నవించారు. పట్టణంలో చాలా చోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారాల చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకోనే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా విద్యుత్ తీగలు కిందకు ఒరిగి నేలకు అందుతున్నాయని, దీంతో వాహనాదారులు, పాదచారులు చాలా ఇబ్బందుల పడుతున్నారన్నారు. అలాగే పట్టణ శివారులోని దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మకాలనీ, మారుతీనగర్, తిమ్మనచర్ల తదితర ప్రాంతాల్లోని ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కౌంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, నాయకులు బి.మహేష్, ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఏకగ్రీవం

పామిడి: మండలంలోని గజరాంపల్లి ప్రాథమిక పాఠశాలకు సంబంధించి రెండుసార్లు వాయిదా పడ్డ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నిక శనివారం ఎట్టకేలకు ఏకగ్రీవమైంది. గుత్తి టీడీపీ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ చొరవతో టీడీపీకి చెందిన సుజాతను ఎస్ఎంసీ చైర్మన్‌గా, వైస్ చైర్మగా రమేష్‌ను ఏకగ్రీవం చేశారు. ఎంఈఓ జయానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ


భక్త జన సందోహం మధ్య ఊరేగింపు

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం గ్రామంలో నిర్వహించిన ఊరేగింపు శ్రీకృష్ణుడి నామస్మరణతో మార్మోగింది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం గ్రామంలో స్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామిని పల్లకీపై కొలువుదీర్చి ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన నాగుల చవితి వేడుకలు


గుత్తిలో నాగ దేవతకు పూజలు చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ వ్యాప్తంగా శనివారం నాగుల చవితి వేడుకలు ముగిశాయి. నెల రోజులుగా మహిళలు, భక్తులు నాగుల కట్టల వద్ద పూజలు చేసి, నాగ దేవతలకు పాలు పోశారు. ఈ క్రమంలో శనివారం అన్ని ప్రాంతాల్లోని నాగుల కట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది.